

లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, మార్చి13: అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రజాపాలనలో భాగంగా గురువారం మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు ఇవ్వడంతో పాటు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతంకుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, ఏఎంసీ వైస్ చైర్మన్ జంగయ్య, డైరెక్టర్లు సత్యనారాయణ, రమేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాదయ్య, మాజీ సర్పంచ్‌లు ప్రవీణ్, రామకృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీలు వెంకటేశ్, రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మహ్మద్ మీనాజుద్దీన్, నాయకులు విజయరాజు, నాయకులు సంజీవ, నరేశ్, యాదగిరి చారి, మల్లేశ్, యాదయ్య, అనీల్ పాల్గొన్నారు.



## ఘనంగా ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు

కొత్తూరు, మార్చి 13: మండల పరిధిలోని వైఎంతండాలో ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలను బంజారా జాగృతి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై తండా వాసులుతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాత్లావత్ అరుణరమేశ్‌నాయక్, బాబురాజ్‌నాయక్, పాత్లావత్ అన్యానాయక్, రాములునాయక్, సూర్యనాయక్, రాంజీనాయక్, లోక్యనాయక్, లంబాడాలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి

### చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్లటౌన్, మార్చి 13: ప్రతిఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైక్ నడిపేటప్పుడు లైసెన్స్‌తో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ ఎస్సై కిషన్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి




విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కడ్తాల్, మార్చి 13: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. ఈ నెల 12న సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం జంగయ్య తెలిపారు. వీరు మే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు పీఈటీ భీముడునాయక్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, స్వేత, ఇంద్రారెడ్డి, కౌసల్య, భాగ్యలక్ష్మి, శోభారాణి, బుచ్చమ్మ, సునీత, భాగ్యమ్మ, గీతాభాయ్, స్రవంతి, శంకర్‌నాయక్, మల్లయ్య, తిరుపతి, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రహీమ్, పాషా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎల్ ఆర్ఎస్‌కు విశేష స్పందన

కొత్తూరు, మార్చి 13: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌కు భారీ స్పందన వస్తుందని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టిన తర్వాత ప్రొసీడింగ్‌ను కమిషనర్ బాలాజీ యజమానికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాంటు యజమానులు తప్పనిసరిగా ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామచందర్, సీనియర్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

# గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి

**మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**అసెంబ్లీ ముట్టడికి మండల సాధన సమితి నాయకుల పిలుపు**

**జేఏసీ నాయకుల ముందస్తు అరెస్ట్**



కడ్తాల్ : ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, మార్చి 13: కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజాస్వామ్యానికి ఖూనీ జరుగుతున్నదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండిపడ్డారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, కొన్ని రోజులుగా మండల సాధన సమితి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో గురువారం అసెంబ్లీ ముట్టడికి మండల సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు జేఏసీ నాయకులతోపాటు, వివిధ పార్టీలకు చెందిన నాయకులను గురువారం తెల్లవారుజామున పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆయా పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ నాయకులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ముసుగులో రాక్షస పాలనను సాగిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. మండల సాధనకు శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపేందుకు హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన నాయకులను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని రఘుపతిపేట్, ఇర్విన్, వెల్జాల్ గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, అనురాధపత్యానాయక్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, సాయిలు, శ్రీనివాస్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండూనాయక్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ మహేశ్, నాయకులు జగన్‌యాదవ్, టీకులాల్‌నాయక్, అంజి, శ్రీను, శ్రీకాంత్, ప్రసాద్, సక్రు, మల్లేశ్, పవన్, జగన్ పాల్గొన్నారు.

# అడుగడుగునా గుంతలమయం

**అధ్వానంగా మారిన మేడిపల్లి-చరికొండ రోడ్డు**

**కంకరతేలిన వైనం..**

**నరకప్రాయంగా ప్రయాణికుల దుస్థితి**

**పట్టించుకోని అధికారులు**



కంకర తేలి అధ్వానంగా మారిన మేడిపల్లి-చరికొండ వెళ్లే రోడ్డు

యాచారం, మార్చి 13: యాచారం-చరికొండ రోడ్డు ఎంతో అధ్వానంగా మారింది. రోడ్డంతా అడుగడుగునా కంకరతేలి గుంతలమయంగా మారింది. సుమారు 11కిలో మీటర్ల మేర రోడ్డు బీటీ కొట్టుకుపోయి కంకరతేలి దారుణంగా తయారైంది. ఈ రోడ్డు వెంట రాకపోకలు సాగించే ప్రయాణికులకు నిత్యం నరకంచూపెడుతుంది. గుంతలతో కూడిన దారివెంట ప్రయాణించాలంటేనే ప్రయాణికులు, వాహనదారులు జంకుతున్నారు. ఆ రోడ్డుపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవటం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నుంచి పల్లెచెల్కతండా మీదుగా కడ్తాల మండలం చరికొండ వెళ్లే రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రోడ్డంతా పూర్తిగా బీటీ కొట్టుకుపోయి కంకరతేలింది. రెండు మండలాలకు చెందిన ప్రయాణికులకు ఈ రోడ్డు నానా అవస్థలకు గురి చేస్తుంది. పల్లెచెల్కతండా, చరికొండ, మద్విన్, నాగిళ్ల, అప్పారెడ్డిపల్లి, ఎక్వాయపల్లి, గోవిందాయపల్లి, ఆకుతోటపల్లి, చెట్టిపల్లి గ్రామాలకు హైదరాబాద్, యాచారం, మాల్ ప్రాంతాల నుంచి చేరుకోవడానికి ప్రయాణికులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. ఆకుతోటపల్లి నుంచి హైదరాబాద్, ఆమనగల్లు నుంచి మాల్‌కు ఆర్టీసీ బస్ సర్వీసులు కొనసాగుతాయి. పైగా అటు నాగార్జున రహదారి నుంచి శ్రీశైలం ప్రధాన రహదారి గుండా తక్కువ సమయంలో నేరుగా చేరుకుంటారు. సంబంధిత అధికారుల్లో ఏ మాత్రం కదలికలు లేకపోవటం గమనార్హం. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

**రోడ్డుకు మరమ్మతులు చేయించాలి**



మేడిపల్లి నుంచి చరికొండ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి పదకొండు కిలోమీటర్లు వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రద్దీగా ఉండే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

- గణేశ్, ఏవీజీ ఫౌండేషన్ చైర్మన్ మేడిపల్లి

## 'కుప్పలు తెప్పలుగా చెత్త' కథనానికి స్పందన

**చెత్తను తొలగించిన మున్సిపల్ అధికారులు**

మొయినాబాద్, మార్చి13:జాతీయ రహదారి పక్కన, ప్రభుత్వ దవాఖాన ప్రహరీని ఆనుకుని కుప్పలు తెప్పలుగా చెత్త అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. గురువారం నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి మున్సిపల్ సిబ్బందితో రహదారి పక్కన ఉన్న చెత్తను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేసి ప్రతి దుకాణం యజమానికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. చెత్తను ఎవరు కూడా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని , ఎవరైనా అలా చెత్తను వేస్తే వారికి జరిమానా విధిస్తామని చెప్పారు.



చెత్తను తొలగించిన తరువాత ..

## విజేతకు నగదు పురస్కారం



విజేతకు నగదు పురస్కారంతోపాటు షీల్డ్‌ను అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కేశంపేట, మార్చి 13: మండలంలోని లింగంధన గ్రామంలో నిర్వహించిన లింగంధన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేతకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సహకారంతో నగదు పురస్కారాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు నాగిళ్ల వెంకటేశ్ మాట్లాడుతూ.. పల్లెల్లోని యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని, కఠోర సాధన చేసి అంతర్జాతీయ స్థాయికి ఎదుగాలన్నారు. టోర్నీ విజేతలకు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సహకారంతో విజేతకు ప్రథమ బహుమతి రూ.25వేలు, గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి సహకారంతో రూ.15వేలు ద్వితీయ బహుమతి విజేతకు అందజేశారు. అనంతరం టోర్నీలో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా రాజశేఖర్, ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా శేఖర్, ఉత్తమ బౌలర్‌గా చందుకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ రాంరెడ్డి క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు టీషర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూదన్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామస్వామి, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, పురుషోత్తం, జంగయ్య, కృష్ణ, వినయ్, శేఖర్ పాల్గొన్నారు.

## 'ఫ్యూచర్‌సిటీలో మా గ్రామాలను కలుపాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యాచారం, మార్చి13: మండలంలోని మొండిగౌరెల్లి, మంథన్‌గౌరెల్లి, కేసీతండా గ్రామ పంచాయతీలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని కోరుతూ కలెక్టర్ నారాయణరెడ్డికి ఆయా గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండలంలో మొండిగౌరెల్లి, మంథన్‌గౌరెల్లి, కేసీతండా గ్రామాలు వెనుకబడిన గ్రామాలుగా ఉన్నాయని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపడంతో అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకుంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మంథన్‌గౌరెల్లి, కేసీతండా గ్రామాలు గిరిజన జనాభా కలిగి ఉన్నాయని తెలిపారు. మండలంలో ఇప్పటికే కేటాయించిన 17గ్రామాలతో పాటుగా మొండిగౌరెల్లి, మంథన్‌గౌరెల్లి, కేసీతండా పంచాయతీలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో శంకర్‌నాయక్, తాండ్రరవి, అరవింద్‌నాయక్ ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి



నిరాహార దీక్షకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

మొయినాబాద్, మార్చి13: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతను కల్పించి న్యాయం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి అన్నారు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడు రోజులుగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కె మహేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించిందని తెలిపారు. ప్రభుత్వం మాదిగలకు అన్యాయం జరుగకుండా కోర్టు తీర్పును అనుసరిస్తూ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. వర్గీకరణ పూర్తి అయిన తరువాతనే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జయవంత్, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తిరెడ్డి, నర్సింహారెడ్డి, పరమేశ్, షాబాద్ ప్రవీణ్, దర్శన్, భాస్కర్, అసీఫ్, రవిపాల్, అశోక్‌గౌడ్, వికాస్ పాల్గొన్నారు.

## జర్నలిస్టు అరెస్టు అప్రజాస్వామికం

షాద్‌నగర్, మార్చి 13: రైతుబంధు నిధుల విషయమై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జర్నలిస్టులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్‌ల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జర్నలిస్టులు వార్తలను ప్రసారం చేయడంతో అప్రజాస్వామిక పద్ధతిలో మహిళా జర్నలిస్టులు అని కూడా చూడకుండా అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

## టీఎస్ఎస్‌వో సోషల్ మీడియా ఇన్‌చార్జి నియామకం

ఆమనగల్లు, మార్చి 13: ఆమనగల్లు పట్టణానికి మీసాల బాలవర్షిత్ టీఎస్ఎస్‌వో (తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్) రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర కార్యాలయంలో టీఎస్ఎస్‌వో వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనివాస్ బాలవర్షిత్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌వో రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుదర్శన్, నాయకులు సుధాకర్, సంపత్ ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి




సమావేశంలో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల

చేవెళ్లటౌన్, మార్చి 13: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ పేస్-2లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణగా ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా నేటికీ సమాజంలో గౌవరం దక్కకపోగా, లైంగిక వేధింపులు, వరకట్నపు చావులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల మహిళా సమాఖ్య నాయకురాలు వెంకటమ్మ, లలిత, విజయమ్మ, జయమ్మ, యాదమ్మ, రాములమ్మ, చంద్రకళ, బాబురావు పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల్, మార్చి 13: స్వేరోస్ భీమ్ దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఈ నెల 15న ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న స్వేరోస్ భీమ్ దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను, గురువారం స్వేరోస్ సభ్యులతో కలిసి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ ఆవిష్కరించారు. దీక్ష కార్యక్రమంలో సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శివకుమార్ కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల, నాయకులు శ్రీశైలంగౌడ్, చందు, అశ్విన్‌కుమార్, కిరణ్, భాస్కర్, రాజు, మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా బూర్గుల రామకృష్ణారావు జయంతి



బూర్గుల రామృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 13 : హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జయంతిని గురువారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంక్షేమ సమితి అధ్యక్షులు శ్రీనివాస్, వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ..హైదరాబాద్ తొలిముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధిగా ఎంతో కృషి చేసిన గొప్పనాయకుడు రామకృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు దిలిప్‌కుమార్, ప్రభాకర్, శంకర్, శ్రీనూనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, శ్రీనాథ్, బీరప్ప, మల్లేశ్, సునీల్‌రెడ్డి, ఉమాప్రసాద్, రాఘవేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

## భవనం పైనుంచి పడి వృద్ధుడు మృతి

మొయినాబాద్, మార్చి13: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన పెద్దిటి గెవింద్‌రెడ్డి(75) మొదటి అంతస్తులో ఉంటాడు. బుధవారం రాత్రి ఇంటి బయట గొడవ జరుగుతుండగా బయటకు చూడటానికి వచ్చాడు. భవనానికి రేలింగ్ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి భవనం పైనుంచి కింద పడడంతో తలకు గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

షాబాద్, మార్చి 13: రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన మొగిలిగిద్ద సుధాకర్, కొత్తపల్లి బాలయ్య ఇద్దరు కలిసి గురువారం బైకుపై అంతారం గేట్ నుంచి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన రజినీకాంత్ తన బైకుపై పొలానికి వెళ్తుండగా మార్గమధ్యంలో రైతువేదిక సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మొగిలిగిద్ద సుధాకర్, రజనీకాంత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మొగిలిగిద్ద సుధాకర్ మృతిచెందాడు. మృతుడు పరిగి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆర్టీసీ బస్సు ఢీకొని..**

చేవెళ్ల రూరల్ : ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతిచెందింది. మోకిలా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మోకిలాలో నివసిస్తున్న రవీందర్, ఉమాదేవి(55) దంపతులు బుధవారం సాయంత్రం తన బైక్‌పై నార్సింగికి వెళ్లారు. తిరిగి వస్తుండగా.. మార్గంమధ్యంలో సుభిషి టౌన్ షిప్ వద్ద ఉన్న ఉడిపి హోటల్‌వద్ద టీ తాగుదామని యూటర్న్ తీసుకుంటుండగా.. వెనుకనుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న వారి కొడుకు అఖిల్ రాజ్‌కుమార్ వెంటనే అక్కడికి చేరుకొని ఇద్దరిని శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. తల్లి ఉమాదేవి పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని మరో దవాఖానకు తీసుకెళ్లాడు. పరిశీలించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ అతివేగమే కారణమని మృతురాలి కొడుకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

యాచారం, మార్చి13: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని గాండ్లగూడలో యాచారం పోలీసులు గురువారం సైకిల్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దొంగతనాలు, సైబర్ మోసాలపై పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానం, ఆన్‌లైన్ గేమ్స్‌కు, పేకాట తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బస్టాండ్లు, సంతలు, దుకాణ సముదాయాల వద్ద మహిళలు సెల్ ఫోన్లు, గొలుసు దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించాలని, లేదంటే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## వివాహిత ఆత్మహత్య

కొందుర్గు, మార్చి 13: వివాహిత మృతి చెందిన ఘటన కొందుర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మండలానికి చెందిన సుజాత(21)లింగంపల్లికి చెందిన రాములుతో 7 ఫిబ్రవరి 2025న వివాహం జరిగింది. అదనపు కట్నంకోసం సుజాతను మామ పోచయ్య, బావ సైదులు వేధించేవారన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులవద్ద చెప్పి కన్నీటి పర్యంతమయ్యేదని, పెళ్లికి రూ.6లక్షల ఖర్చు అయిందని, అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో తల్లిదండ్రుల వద్దకు వెళ్లిందన్నారు. మృతురాలి తల్లిదండ్రులు నచ్చజెప్పడంతో సుజాత భర్తవద్దకు మార్చి 7న మండల పరిధిలోని ఎంకిర్యాల గ్రామానికివచ్చిందని, రాములు బావ రామకృష్ణ ఇంట్లో ఉంటున్నారన్నారు. ఈ నెల 12న రామకృష్ణ ఇంట్లో బాత్‌రూంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తమకు ఫోన్ ద్వారా తెలిపారని మృతురాలి తండ్రి మన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నీరు వృథా అవుతున్నా పట్టించుకోరా..



కేశంపేట, మార్చి 13: వేసవిలో గుక్కెడు నీరు దొరక్కా ప్రజలు అల్లాడుతుంటే ఆ గ్రామంలో మాత్రం రహదారిపై మిషన్ భగీరథ నీరు ఏరులైపారుతుంది. ఓ భారీ వాహనం మిషన్ భగీరథ పైప్‌లైన్ మీదుగా వెళ్లడంతో పగిలిపోయిందని, మరమ్మతులు చేసేందుకు ఎవరు రాకపోవడంతో నాలుగు రోజులుగా నీరంతా వృథాగా పోతుందని స్థానికులు చెబుతున్నారు. నీటి వృథాను నివారించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు బోరు మోటార్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. అధికారులు స్పందించి నీటి వృథాను నివారించడంతోపాటు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు..

మొయినాబాద్, మార్చి13: ఆటో డ్రైవర్ అతివేంగా నడపటంతో ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన ఆటోలో కూరగాయలు తీసుకుని మార్కెట్‌కు వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన బక్క రాజు(35) బైక్‌పై హిమాయత్ నగర్ చౌరస్తా నుంచి చిలుకూరు గ్రామానికి వస్తున్నాడు. కూరగాయలతో ఉన్న వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైకిస్టు అయిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.